సాక్షి
సిద్దిపేట
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023

సిద్దిపేట పట్టణంలోని ఓ వినాయక మండపం ఎదుట శివలింగం ఆకారంలో దీపాల అలంకరణ





సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 27-09-2023
సమయం: బుధవారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు
అంశం: సిద్దిపేట పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమలు, వ్యాధుల తీవ్రత

ఫోన్ నంబర్లు:
9866553321, 9866898692

- వీరవనిత చాకలి ఐలమ్మ ఊరూరా ఘన నివాళి



చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు జిల్లాలో మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, విద్యావంతులు ఊరూరా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరవనిత అని పలువురు కొనియాడారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గజ్వేల్‌లో రామరాజు సబ్బు బిళ్లపై ఐలమ్మ రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.



సబ్బు బిళ్లపై ఐలమ్మ రూపం

గంగమ్మ ఒడికి గణేశుడు

భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. పలుచోట్ల వినాయక నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు శోభాయాత్రగా తీసుకెళ్లి చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేస్తున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల వద్ద కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. తీరొక్క తీర్థ ప్రసాదాలు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు భజనలు చేశారు. లంబోదరుడి నామస్మరణతో మండపాలు మార్మోగాయి.

- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



నిమజ్జనానికి తరలిస్తూ..

న్యూస్‌రీల్

పట్టు సాగుకు సహకారం



పట్టు సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో పట్టు సాగును మంగళవారం సెంట్రల్ సెరికల్చర్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మైసూర్ సిల్క్ బోర్డు నుంచి క్షేత్ర సహాయకులు వర్షగౌడ, పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.వినోద్ కుమార్ సందర్శించారు. సాగు వివరాలు, పాటిస్తున్న మెలకువలు, సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. పట్టు సాగుకు అన్ని విధాల రైతులకు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మట్టిని, పట్టు ఆకులను, వ్యవసాయ భావిలోని నీటిని పరీక్షల నిమిత్తం సేకరించి తీసుకెళ్లారు. వారి వెంట జిల్లా సహాయ సంచాలకులు ఇంద్రసేనారెడ్డి, క్షేత్ర సహాయకులు రాఘవేంద్ర, సెరికల్చర్ అధికారి లింగం తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



ఉపాధి హామీ కూలీలకు బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న డీపీఓ తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్లాపూర్, విఠలాపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు స్టీల్ వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్స్‌లు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని, స్టీల్ వస్తువులు వినియోగించాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ 'ఉపాధి' కూలీలకు అందజేస్తామని తెలిపారు. మంత్రి సొంత నిధులతో ఈ స్టీల్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్ రెడ్డి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర శిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్వారీ అనుమతులు రద్దు చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హుస్నాబాద్: గుట్టల క్వారీల అనుమతులు తక్షణం రద్దు చేయాలని సర్దార్ పాపన్న కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తన్న గౌడ్ విమర్శించారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాపన్న గుట్టల ప్రాంతంలో బైరన్న చెరువు, మహా సముద్రం చెరువు, ఎన్నో జంతువులకు ఆలవాలమైన ప్రకృతి ఈ గుట్టల్లో సంతరించుకుందన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో ఒక్క గుట్ట కూడా ఉండదని ఆరోపించారు. గుట్ట పరిరక్షణకు పోరాడుతామన్నారు.

క్రీడలకు వేదిక.. కీర్తి పక్కా

అంతర్జాతీయ ఖ్యాతే లక్ష్యం
- వసతుల కోసం రూ.11కోట్లు మంజూరు
- మట్టిలో మాణిక్యాలను వెలికితీద్దాం
- మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: 'సిద్దిపేట ప్రస్తుతం క్రీడలకు వేదికగా మారింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణలో భాగస్వామ్యం అయ్యింది. భవిష్యత్తులో ఇక్కడి క్రీడాకారులకు మరింత ఉత్తమ శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా పనిచేస్తామని' రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అందుకు వసతుల కల్పన కోసం రూ.11 కోట్లు ప్రత్యేకంగా మంజూరయ్యాయని, త్వరలో ఉత్తర్వులు జారీ చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో 67వ క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి పాఠశాలల ఆటల పోటీలను క్రీడా జ్యోతి వెలిగించి మంత్రి ప్రారంభించారు. ఎస్జీఎఫ్ (పాఠశాల క్రీడా సమాఖ్య)వచ్చాక గ్రామీణ క్రీడలకు దేశ స్థాయిలో, అందులో మన రాష్ట్రానికే ఎక్కువగా అవార్డులు వస్తున్నాయన్నారు. సిద్దిపేట విద్య, వైద్యం, రిజర్వాయర్లు, క్రీడలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందని అన్నారు. వాలీబాల్ అకాడమీలో మంచి కోచ్‌లను ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేస్తానన్నారు. రూ.1.05 కోట్లతో వాలీబాల్ కోర్టు కోసం కేటాయింపు, రూ.5కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా క్రికెట్ స్టేడియంలో ఒక మంచి గ్యాలరీ ఇతర వసతుల కల్పన కోసం రూ.4 కోట్లతో మరింత అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

క్రీడా స్ఫూర్తితో..

ప్రతి విద్యార్థికి చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యం అనేది క్రీడలతోనూ సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో సాగాలని సూచించారు. అంతకు ముందు క్రీడల ప్రారంభ నేపథ్యంలో పావురాలను ఎగురవేసి, క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్ఓ నాగేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల లాండ్రీలకు..

సిద్దిపేటకమాన్: రజకుల లాండ్రీలకు కేసీఆర్ ప్రభుత్వం శాశ్వతంగా ఉచిత విద్యుత్ అందిస్తోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఐలమ్మ పోరాట, ఉద్యమ స్ఫూర్తిని చాటారన్నారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. వారంలోపు రజకులకు ఫంక్షన్‌హాల్ కోసం స్థలం కేటాయిస్తామని మంత్రి హామీనిచ్చారు. కోమటిచెరువు సమీపంలో ఉన్న ఓపెన్ ఎయిర్ ఆడిటోరియానికి చాకలి ఐలమ్మ నామకరణం చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 500 మంది రజకులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ రజకులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని, దేశంలో ఏ రాష్ట్రంలో రజకులకు ఉచిత కరెంట్ ఇవ్వడం లేదన్నారు.



క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా పావురాన్ని ఎగురవేస్తున్న మంత్రి హరీశ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ తదితరులు



తలపడుతున్న గజ్వేల్, కోహెడ కబడ్డీ జట్లు

క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ

జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 153 మందికి సీఎంఆర్ చెక్కులు, ఆలాగే 49 మందికి షాదిముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులు మంత్రి అందించారు. అనంతరం టీటీసీ భవన్‌లో, రైతుబజార్‌లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటి వినియోగం మరింత పెంచేందుకు అందరూ కృషి చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని కేసీఆర్ డబుల్‌బెడ్రూం కాలనీలో నిర్మించనున్న కుమ్మర మోడ్రన్ యాంత్రిక పాటారి ఇండస్ట్రీకి మంగళవారం మంత్రి శిలాఫలకం వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఓల్డ్ ట్రెండ్ మళ్లీ వస్తుందని, ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోందన్నారు. రూ.2.5 కోట్లతో ఈ పరిశ్రమను నిర్మిస్తున్నామన్నారు. అందుకు గాను రూ.5 కోట్ల విలువ గల రెండు ఎకరాల భూమిని కేటాయించామన్నారు. టెక్నాలజీని ఉపయోగించి మట్టి పాత్రలను ఈ పరిశ్రమలో తయారు చేస్తారన్నారు. ఈ పరిశ్రమలో జిల్లాలో అనేక మందికి లబ్ధిచేకూరుతుందన్నారు.

సంఘవిద్రోహ శక్తులపై నిఘా

- సమన్వయంతో విధులు నిర్వర్తించాలి
- ముందస్తు సమాచారం సేకరించాలి
- సిద్దిపేట సీపీ శ్వేత

తొగుట(దుబ్బాక): రాబోయేది ఎన్నికల సమయం కావడంతో పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు సంఘ విద్రోహ శక్తులపై నిఘా ఉంచాలని సీపీ శ్వేత అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్, సీఐ కార్యాలయాన్ని మంగళవారం సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి వాటిని డిస్పోజ్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు ఎక్కువగా ఎలాంటి కేసులు వస్తున్నాయని ఆరాతీశారు. గత మూడేళ్లుగా నమోదవుతున్న కేసులను పరిశీలించారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తూ పాత నేరస్తులను తనిఖీ చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతీ ఒక్కరికీ తెలిసి ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కేసుల రేట్‌ను తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ రమేశ్, తొగుట సీఐ కమలలాకర్, ఎస్ఐ లింగం, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ శ్వేత

మరిన్ని పతకాలు సాధించండి

- చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి
- అటవీ కళాశాల డీన్ ప్రియాంక వర్గీస్

ములుగు(గజ్వేల్): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ములుగు అటవీ కళాశాల డీన్, సీఎం కార్యాలయ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ సూచించారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలలో గెలుపొంది బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన కళాశాల విద్యార్థులను మంగళవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునుముందు మరిన్ని పతకాలు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ నెల 30న కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థులు విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల జేడీ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పతకాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రియాంకవర్గీస్

డివిజన్ కోసం ఉద్యమం తీవ్రతరం



దుబ్బాకలో కరపత్రాల పంపిణీ

దుబ్బాకటౌన్: రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని జేఏసీ బాధ్యులు మాడవైన శ్రీకాంత్ అన్నారు. మంగళవారం దుబ్బాకలో డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలో తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ లోగా డివిజన్ పై ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి స్పందించి దుబ్బాక ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన

దుబ్బాకటౌన్: పట్టణంలో అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ మంగళవారం దుబ్బాకలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు భాస్కర్,పద్మ,విజయ,పద్మలత తదితరులు ఉన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోందని, ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి మల్లేశం అన్నారు. మంగళవారం అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె 16వ రోజుకు చేరుకున్న సందర్భంగా సంఘీభావం ప్రకటిస్తూ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా సమ్మె దారిలోనే హక్కులను సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే..

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డికి అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను తమిళనాడు తరహాలో పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్‌తో పాటు ఆరోగ్య బీమాసౌకర్యం కల్పించాలన్నారు. పాండిచ్చేరిలో ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు రూ. 30వేల వేతనం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో మాత్రం ఆరేళ్లుగా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రూ. 26 వేల వేతనం ఇవ్వడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటచారి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది విజయ, శోభ, అంజలి, సమంత, రామలీల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కన్నీటి సంద్రం..

- విషాదపేటగా అంబర్‌పేట
- గ్రామానికి చేరుకున్న మృతదేహాలు
- బోనాల పండుగకు వెళ్లి.. విగతజీవులుగా మారడంతో మిన్నంటిన రోదనలు
- ఇద్దరు తోటికోడళ్లు, బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు



బాధిత కుటుంబీకులను ఓదారుస్తున్న ప్రతాప్‌రెడ్డి



అమ్మ ఏదంటూ తండ్రిని పట్టుకుని ఏడుస్తూ ..



బేలచూపులతో చిన్నారులు

వర్గల్(గజ్వేల్): మిన్నంటిన రోదనలతో అంబర్‌పేట విషాద 'పేట'గా మారింది. రెండురోజుల క్రితం బోనాల పండుగకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మంగళవారం శవాలుగా మారడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది. అంతిమయాత్ర కన్నీటిసంద్రంగా మారింది. మూడు రోజుల క్రితం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో తమ సోదరి లక్ష్మి ఇంట్లో బోనాల పండుగ కోసం వర్గల్ మండలం అంబర్‌పేటకు చెందిన అన్నదమ్ములు దుద్దు యాదగిరి-బాలమణి, దుద్దు శ్రీకాంత్-లక్ష్మి తమ పిల్లలతో కలిసి వెళ్లారు. సోమవారం అక్కడి చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి, చెరువులో మునిగిపోతున్న చరణ్‌ను కాపాడే ప్రయత్నంలో తోడికోడళ్లు బాలమణి, లక్ష్మి, బాలుడు చరణ్ (యాదగిరి, బాలమణి దంపతుల కొడుకు), అక్క కూతురు లావణ్య మృత్యువాత పడిన విషయం విదితమే. మృతుల్లో ముగ్గురు అంబర్‌పేట వాసులే కావడంతో పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాలు ఇక్కడకు చేరుకోవడంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అయినవాళ్లను కోల్పోయి..

అంబర్‌పేటకు చెందిన అన్నదమ్ములు దుద్దు యాదగిరి-బాలమణి దంపతులకు చరణ్(ఐదో తరగతి), శ్రీవాణి(ఏడోతరగతి), శ్రీకాంత్-లక్ష్మి దంపతులకు నమృత్(ఒకటోతరగతి), అక్షర(అంగన్‌వాడీ) పిల్లలు ఉన్నారు. భర్తలు డ్రైవర్లు కాగా తోడికోడళ్లు దినసరి కూలీలు. వీరంతా సంతోషంగా పండుగ సంబరాలకు వెళ్లారు. వీరి పచ్చని కాపురాలపై విధి కన్నెర్రచేసింది. చెరువు రూపంలో బాలమణి, చరణ్, లక్ష్మిలను మింగేసింది. భార్య, కొడుకును కోల్పోయి యాదగిరి, భార్య మృతితో శ్రీకాంత్ పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయారు.

పలువురి పరామర్శ

అంబర్‌పేటలో బాధిత కుటుంబాలను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించి రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. సభ్యత్వం ఉన్నందున బీఆర్ఎస్ తరఫున పరిహారం కూడా అందిస్తామని ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వేర్వేరుగా సందర్శించి, మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

తలకొరివి పట్టి..

బాలమణి అంతిమయాత్ర సందర్భంగా భర్త యాదగిరి తలకొరివి పట్టారు. చరణ్‌కు నానమ్మ మల్లమ్మ తలకొరివి పట్టారు. లక్ష్మి అంతిమయాత్రలో ఐదేళ్ల కొడుకు నమృత్ తలకొరివిపట్టాడు. మొదట చిన్నారి చరణ్ అంత్యక్రియలు, ఆ తరువాత తోటికోడళ్ల అంత్యక్రియలు జరిగాయి.

క్లుప్తంగా

సభ్యత్వ నమోదులో పీఆర్టీయూ ముందంజ



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

దౌల్తాబాద్(దుబ్బాక): సభ్యత్వ నమోదులో పీఆర్టీయూ ముందంజలో ఉందని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలోని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి త్యాగరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల జెడ్పీ పాఠశాల హెచ్ఎం, మండల విద్యాధికారి బండి నర్సవ్వ, పీఆర్టీయూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి

దుబ్బాకటౌన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కౌన్సిలర్ దేవలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి ఎంతమంది వెళ్లినా పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. పార్టీలో కోవర్టులు ఉన్నారని వారిని త్వరలోనే బయటికి పంపిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సోనియాగాంధీ ప్రకటించిన ఆరు పథకాలపై గడప గడపకు వెళ్లి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో స్రవంతి, రజిని, నరసవ్వ, లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

పోక్సో కేసులో వృద్ధుడి..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిని పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు. పెద్దపురం రాములు(65) ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు మంగళవారం పోక్సో కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళల పట్ల అభ్యంతరకరంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సుఖసంతోషాలతో ఉండాలి

కొడిపల్లి(నర్సాపూర్): వినాయకుని దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం కొడిపల్లి, భుజిరంపేటలోని పలు వినాయక మంటపాల వద్ద ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రవీన్ కుమార్, సత్తయ్య, శ్రీనివాస్, లింగం, దుర్గారెడ్డి, రాజిరెడ్డి, జగన్‌రెడ్డి, పోల నవీన్, మురళి, అనిల్, సంతోషగౌడ్, తిరుపతిరెడ్డి, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

రమణీయం.. రంగనాయక సాగరం

- ఒకేచోట ఆధ్యాత్మికం.. ఆహ్లాదకరం
- ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్న పచ్చదనం
- ఉత్తమ పర్యాటక గ్రామంగా చంద్లాపూర్
- నేడు అవార్డు అందజేయనున్న కేంద్రం



గుట్టపై గరుత్మంతుడి విగ్రహం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక చెంతకు ఆహ్లాదం చేరింది.. భక్తి భావాల అంతరంగాలకు సాగర తరంగాలు తోడయ్యాయి. లక్ష్మీ రంగనాయక స్వామి వెలసిన ప్రదేశానికి జలహారం పడడం పండుగలకే పండుగైంది. ఫలితంగా చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. బుధవారం జాతీయ పర్యాటకదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం అవార్డు ప్రదానం చేయనుంది.


సిద్దిపేటకు 8 కిలోమీటర్ల దూరంలో చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులో లక్ష్మి రంగనాయకస్వామి కొండ ఉంది. కొండపైన స్వామి వారు కొలువు దీరారు. ఆ భగవంతుడు ఆసీనుడైన చోట తన పేరిట రంగనాయక సాగర్ ఆవిర్భావం కావడం గ్రామానికి పెద్ద గుర్తింపు తెచ్చింది. ఆహ్లాద వాతావరణం, పచ్చటి పంటపొలాలు, ద్వీపాన్ని తలపించే సాగరం, అడుగడుగునా హరిత సంపద వంటి విశేషాల సమాహారం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. విజ్ఞాన యాత్రలకు నెలవుగా మారింది.

సైక్లింగ్, పరుగు పోటీలకు వేదికగా నిలచింది. రిజర్వాయర్ మధ్యలో ఉన్న 50 ఎకరాల స్థలం ఒక ద్వీపంగా దర్శనమిస్తుంది. అక్కడే గెస్టు హౌస్, ఎస్ఈ కార్యాలయాలు నిర్మించారు. సుడా ఆధ్వర్యంలో రిసార్ట్ ప్రారంభించగా, ఇటీవల ఫార్మసీ కళాశాల ప్రారంభించారు. ఇక్కడే పలు నర్సరీలు, పార్కులు కూడా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామం మొత్తం పచ్చదనంతో అలరారుతోంది. ప్రకృతి సహజత్వం ఉట్టిపడుతూ తీపి అనుభూతులను మదినిండా మూటకడుతుంది రంగనాయకసాగర్.. రంగనాయక స్వామి గుట్టపైకి కోటి రూపాయలతో చక్కని సీసీ రోడ్డు వేశారు.



బండరాయిలో వెలసిన రంగనాయక స్వామి విగ్రహం

పెద్దపెద్ద వాహనాలు సైతం గుట్టపైకి సులువుగా చేరేలా ఏర్పాటు చేశారు. గుట్టపై వివాహాలు చేసుకునేందుకు ఫంక్షన్ హాల్ కూడా నిర్మించారు. 68 అడుగుల గరుత్మంతుడి విగ్రహం భక్తులకు అదనపు ఆకర్షణగా నిలిచింది. అలాగే రిజర్వాయర్‌ను సందర్శించడానికి నిత్యం పర్యాటకుల తాకిడి పెరిగింది. దీంతో చంద్లాపూర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది.



రంగనాయక సాగర్ రిజర్వాయర్

సంతోషంగా ఉంది



రంగనాయక సాగర్ రిజర్వాయర్‌తో చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ట లభించింది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రిజర్వాయర్ నిర్మించడం, రంగనాయక స్వామి గుట్టను ఎంతో అభివృద్ధి చేయడంతో మా గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది.

– చంద్రకళ, సర్పంచ్

మంత్రి కృషి వల్లే గుర్తింపు...



మంత్రి హరీశ్‌రావు కృషి, పట్టుదల ఆయన అందించిన తోడ్పాటు వల్లే ఈ గుర్తింపు వచ్చింది. రంగనాయక స్వామి గుట్టతో పాటు రంగనాయక సాగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. అక్కడే ఫార్మసీ కళాశాల, నర్సరీలు, పార్కులు ఏర్పాటు చేయడంతో మరింత శోభ సంతరించుకుంది. గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది.

– రోజాశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



బస్వాపూర్‌లో పల్లె దవాఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం బస్వాపూర్ గ్రామంలో రూ.22లక్ష వ్యయంతో చేపట్టనున్న కంటి దవాఖానా భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా బస్వాపూర్ గ్రామంలో రూ.కోటీ ఐదు లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తంగళ్ళపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రె శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, రైతు సమన్వయ మండల కోఆర్డినేటర్ పేర్యాల రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ కనకయ్య ఉన్నారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన ఇద్దరికి సిద్దిపేట కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన జి.శివ, టి.వెంకటేష్‌లు నాలుగు రోజుల క్రితం మద్యం సేవించి పట్టణంలో ప్రజలను ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి మంగళవారం వారికి ఆరు రోజుల జైలుశిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..



అజయ్(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మాలపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శనిగరం భిక్షపతి, భారతి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్(24) ఇంటర్ వరకు చదువుకుని తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తుంటాడు. మంగళవారం పశువులకు మేత వేసేందుకు వెళ్లిన అజయ్ పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న బావిలో కాలుజారి పడిపోయాడు. పొలం దగ్గరకు వెళ్లిన కొడుకు తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు వెతికారు. బావిలో చూడగా చెప్పులు కన్పించాయి. స్థానికులు బావిలోకి దూకి అజయ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



వెరీ కాస్ట్‌లీ గురూ..!

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినాయక నవరాత్రి ఉత్సవంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని శ్రీపార్వతి మాత ఫ్యామిలీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపంలో గణనాథుని విగ్రహాన్ని రూ.15లక్షలతో అలంకరించారు. రూ.500 నోట్లు రెండు లక్షలు, రూ.200 నోట్లు రెండు లక్షలు, రూ.100 నోట్లు మూడు లక్షలు రూపాయలు, రూ.50 నోట్లు 3లక్షలు, 20 నోట్లు 4లక్షలు, రూ.10నోట్లు లక్షతో అలంకరించారు. ఈ ధన వినాయకుడిని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఎమ్మెల్యేల స్కీమ్‌గా 'దళితబంధు'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

మెదక్ కలెక్టరేట్: దళిత కుటుంబాలన్నింటికి దళిత బంధు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట వెల్దుర్తి మండలం రామాయపల్లి, ధర్మారం గ్రామాల దళితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. దళితబంధు ఎమ్మెల్యేల స్కీమ్‌గా ప్రచారం జోరుగా సాగుతుందన్నారు. నాయకులు తమ బినామీలకు, అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే దళితబంధు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన దళితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉపకులాల బుడగ జంగాల, మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్, కృష్ణ, సుధాకర్, యాదగిరి, నర్సింలు, రాములు, పోచయ్య, సాయిలు, గట్టయ్య, లింగం, కిషన్, శేకులు, గట్టయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు నుంచి కిందపడి..

కొల్చారం(నర్సాపూర్): ఇంటి పైకప్పు సర్దుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నెల్లి సంగమేశ్వర్(35) ఈనెల 24న ఇంటిపై ఉన్న రేకులను సర్దుతుండగా కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగమేశ్వరుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేములవాడ అసెంబ్లీ బీజేపీ ప్రభారీగా బాలేష్‌గౌడ్



బాలేష్‌గౌడ్

దుబ్బాకటౌన్: వేములవాడ అసెంబ్లీ బీజేపీ ప్రభారీగా దుబ్బాకకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలేష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు వేములవాడ అసెంబ్లీలో బీజేపీ జెండాను ఎగుర వేసేందుకు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో అసెంబ్లీ ప్రభారీగా నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 5 వేల ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మరోవైపు మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన భూములను లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గజ్వేల్, వర్గల్ మండలాల కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు మల్లారెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాల స్వామి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలను ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాల స్వామి డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఆశా వర్కర్లు తలపెట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారితోషికాల పేరిట ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆశా వర్కర్లతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లింగంపేట ఎల్లం, హమాలీ అధ్యక్షుడు కూతురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే కేసీఆర్ లక్ష్యం

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మహిళలను అన్నిరంగాల్లో ముందు నిలపాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోటిలింగాల దేవాలయంలో మహిళా పొదుపు సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎంపీల పోరాట ఫలితమే పార్లమెంటు సమావేశాల్లో 33శాతం మహిళా బిల్లు అమలు చేశారన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు రూ 5లక్షలు రుణాలు మాత్రమే ఇచ్చేవని, ప్రస్తుత ప్రభుత్వం రూ.20 లక్షల వరకు అందిస్తున్నారని తెలిపారు. సీఏలు, సీసీల సమస్యను సీఎం పరిష్కరించారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల మాదిరిగా తమకు డ్రెస్‌కోడ్ కావాలని మహిళా సంఘాలు కోరగా పరిశీలిస్తామని వారికి హామీనిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1070మంది యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. అంతకుముందు కోటిలింగాల దేవాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ మనోహర్‌రావు, ఏపీడీ రవీందర్, పీడీఎం రాజయ్య, శ్రీకాంత్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కొమురయ్య, యాదగిరి, రాంరెడ్డి, కనకయ్య, రాంరెడ్డి, అరుణ్‌కుమార్, గోవర్దన్‌రెడ్డి, ఎల్లం, నర్సింలు, మల్లయ్య, కలీముద్దిన్, శ్రీధర్, పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎండీ అహ్మద్, ఎనగంటి కిష్టయ్య, రాజు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో దృఢ నిర్మాణాలు



సదస్సులో పాల్గొన్న భారతి సిమెంట్ ప్రతినిధులు

మెదక్ కలెక్టరేట్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్ లోని శ్రీ రామలింగేశ్వరా ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ.. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 11 దేశాలలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ను తెలంగాణ లో విడుదల చేసినట్లు తెలిపారు. కాంక్రీట్ తయారీలో ఉపయోగించే నూతన టెక్నాలజీ, దృఢమైన కాంక్రీట్‌ను తయారు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ రకాల కాంక్రీట్‌ల గురించి ఇంజినీర్లకు క్లుప్తంగా వివరించారు. మార్కెట్ లో లభించే ఇతర సిమెంట్ తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణం యొక్క దృఢత్వం చాలా అధికంగా ఉంటుందని తెలియచేశారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలియచేశారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ గంగాధర్ రెడ్డి, డీలర్ లింగమూర్తి, స్థానిక ఇంజనీర్లు పాల్గొన్నారు.